కథా కౌముది

# అమిగోస్(Amigos)

మణి వడ్లమాని



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
సాధారణ ప్రచురణ కథ

సెల్ ఫోన్ మళ్లీ బీప్ అయింది ప్రభావతి తన సరికొత్త స్మార్ట్ ఫోన్‌లోని వాట్సాప్ సందేశాన్ని చదవడానికి పరుగెత్తింది. అన్‌లాక్ చేయడానికి కొంత సమయం పట్టింది, మనవడు ఫోన్ ని సెట్ చేసి పెట్టాడు. హడావిడిగా ఆప్ మీద నొక్కింది.

అవును, గ్రూప్ లో మెసేజ్ వచ్చింది. అదీ సత్యవతి దగ్గర నుంచి!

★★★

ఆ మధ్య, స్కూల్ మేట్ శ్యామలను ఓ పెళ్లిలో కలుసుకోవడంతో ఇదంతా మొదలైంది. ఇద్దరూ అన్ని విషయాలూ మాట్లాడుకున్నారు, ఫోన్ నంబర్లు మార్చుకున్నారు. అయితే శ్యామల రోజూ తన వాట్సాప్ సందేశాలను పంపడానికి ఆఫర్ చేసినప్పుడు, ప్రభావతి తన వద్ద స్మార్ట్ ఫోన్ లేదని చెప్పింది.

ఇంటికి తిరిగి వచ్చిన ఆమె తన కొడుకుతో తనకి స్మార్ట్ ఫోన్ కావాలని ఎలా చెప్పాలా అని ఆలోచించింది.

విచిత్రమేమిటంటే, పిల్లలు, ఏ వయసు వారైనా తమ తల్లిదండ్రులను ఏదైనా అడిగేస్తారు. అదే తల్లిదండ్రులు పిల్లలని అడగడానికి జంకుతారు. తన భర్త బతికున్నప్పుడు జీవితం ఇందుకు భిన్నంగా ఉండేది, కానీ ఆమె ఇప్పుడు అలా లేదు. అందుకే ఆమె ఖర్చయినా ఫర్వాలేదు అనుకుంటూ స్మార్ట్ ఫోన్ కొనమని కొడుకును డిమాండ్ చేసింది.

ఇన్ని రోజులూ ఆమె శ్యామల పంపించే ఆధ్యాత్మిక సందేశాలు ఏవీ చూడలేకపోయింది.

ఇంతలో ఒక రోజున మనవడు అనుకోకుండా ఫోన్ కింద పడేయడంతో అది కాస్తా విరిగింది. ఇక అప్పుడు ఫోన్ కొనడం తప్పదు కాబట్టి, తల్లి అడిగిన కొత్త స్మార్ట్ ఫోన్ కొన్నాడు .

ప్రభావతి తన ఏకైక స్నేహితురాలు శ్యామలకి ముందుగా మెసేజ్‌లు పంపింది, ఆమె తనకు, మరికొంత మంది క్లాస్ మేట్స్ ని పరిచయము చేస్తూ మిగతా స్కూల్ స్నేహితులను కలిపింది. నిజానికి ప్రభావతి చాలా సిగ్గరి. స్కూల్ లో చాలా నిశ్శబ్దంగా ఉండేది, ఒకే ఒక్క మంచి స్నేహితురాలు సత్యవతితో మటుకు మాట్లాడేది. పెళ్లి అయ్యాక సత్యవతి గురించిన విషయాలే తెలియలేదు. దాదాపు ఏభై ఏళ్ళు కావస్తున్నాయి.

ఇక రోజూ ఆమె ఫోన్ కి నిర్విరామంగా మెసేజ్ బీప్ లు రావడం ఇంట్లో అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రభావతి ఒక సమూహంలో సభ్యురాలు అని అప్పుడు గ్రహించారు.

“ఏం నాన్నమ్మా! నువ్వు ఇప్పుడు వాట్సాప్ గ్రూప్‌లో ఉన్నావు, స్కూల్ ఫ్రెండ్స్ ఫలానా ఏడాదిట ఇది నీ గ్రూప్ పేరు” అని మనవడు చెబుతుంటే ఒక్క సారి తన స్కూల్ డేస్ లోకి వెళ్ళిపోయింది.

మొదట్లో తెలియలేదు మనవడిని అడిగింది. వాడు “నీకేమీ అర్థము కాదులే నాన్నమ్మా!” అని హేళనగా నవ్వుతూ ఎలా చూడాలో, ఎలా జవాబు ఇయ్యాలో చెప్పడం తో జాగ్రత్త గా విని అర్థము చేసుకుంది.

అంతే నిమిషాలలో బోలెడు మెసేజ్‌లు రావడం, చాలా మంది పేర్లు గుర్తులేకపోయినా గ్రూప్‌లోని అందరూ ఆమెకు స్వాగతం పలకడం, ఇదీ బాగానే అనిపించింది. వారిలో కొందరు వేరే సెక్షన్ కు చెందినవారు దాదాపుగా ఏభై ఏళ్ళ తరువాత ఇలా కలవడం భలే తమాషాగా ఉంది. తనలో తనే నవ్వుకుంది.

ఒక రోజు పొద్దున్నే స్కూల్ లో తన బెస్ట్ ఫ్రెండ్, ఇప్పుడు ఈ గ్రూప్ అడ్మిన్‌లలో ఒకరయిన సత్యవతి ఆమెకు ఫోన్ చేసింది. ఇంచుమించుగా రెండు గంటలకు పైగా మాట్లాడుకున్నారు. ఇద్దరికీ తొందరగా కలుసుకోవాలని ఉంది. తల్లిదండ్రులు, అత్తమామలు, పిల్లలు, మనుమలు, ఇతర క్లాస్ మేట్స్, టీచర్లు... ఇలా ఒకటేమిటి ఎన్నో విషయాలు దొర్లాయి ఇద్దరి మధ్య.

ఆ రోజంతా ప్రభావతి మనసు గాలిలో తేలిపోయింది.

ప్రభావతి ఫోన్ కి దాదాపు ప్రతి ఐదు నిమిషాలకు బీప్ వస్తోంది. కొడుకు, కోడలితో ఎంతో excitement తో చెప్పబోతుంటే “ఇప్పుడు నీ ఫ్రెండ్స్ గోల నాకెందుకమ్మా!” అని కొడుకు విసుక్కున్నాడు, కోడలు “అత్తయ్యా, ఇవన్నీ నాకెందుకు చెబుతున్నారు?” అంటూ అక్కడ నుంచి లేచి వెళ్ళిపోయింది. గ్రూప్‌లో విషయాలను ఎంతో సంతోషంగా వాళ్లతో పంచుకుందామనుకున్న ప్రభావతికి నిరుత్సాహమే మిగిలింది.

"అబ్బా! ఆ గ్రూప్ ని మ్యూట్ చేయమ్మా! ఈ ముసలోళ్లకి వేరే పనీ పాటూ లేదు, అర్థం లేని జోకులు, వీడియోలు, అన్నీ ఫార్వార్డ్స్, టైం వేస్ట్" అంటూ తెగ విసుక్కున్నాడు కొడుకు.

అది వింటున్న ప్రభావతి మనసు చివుక్కుమంది.

'పిల్లలని ఎంత అపురూపంగా చూసుకున్నాము. వాళ్ళు అల్లరి చేసి విసిగించినా ఎంత ఓర్పుగా ఉండేదాన్ని! అలాంటిది ఇప్పుడు నా మీదే నోరు పారేసుకుంటున్నాడు. నిజమే నాకు చేయాల్సిన పని ఏమీ లేదు' అనుకుంది. 'మీ చిన్నప్పటి నుంచి వండడం, ఉతకడం, శుభ్రం చేయడం, ఇది తప్ప నాకు వేరే పనే లేదు, ఇంకో ప్రపంచమూ లేదు' అని ప్రభావతి మనసులోనే నిట్టూర్చింది.

స్నేహితులతో ఈ విధంగా సన్నిహితంగా ఉండటాన్ని ఆస్వాదిస్తున్న ప్రభావతి రోజు మొత్తము లో  చాలాసేపు ఫోన్ కోసమే కేటాయిస్తోంది. ఒక్కసారిగా ఆమెకు జీవితం చాలా అందంగా అగుపించసాగింది. వీడియోలు చూడటం, ప్రత్యుత్తరాలు పోస్ట్ చేయడం, ఒకరికొకరు తరచుగా కాల్ చేసుకోవడం, నవ్వుకోవడం, తాజా గాసిప్‌ల గురించి అప్‌డేట్ చేయడం... ప్రభావతికి కొత్త లోకంలో ఉన్న అనుభూతితో పాటు లోలోపల ఏదో విముక్తి పొందినట్లు గుర్తించింది.

పెళ్లి అయిన తర్వాత కబుర్లు  ఎక్కువగా అత్తమామలు, బంధువులు, భర్త స్నేహితులు, ఇప్పుడు కొడుకు స్నేహితుల గురించే  ఉండేవి.  ఆ గొడవలో ఆమె తన సొంత జీవితం ఎలా ఉంటుందో మరచిపోయింది.

ఈ వాట్సాప్ ద్వారా విశ్రాంతి దొరకుతోంది. తన పాత జీవితాన్ని వెనక్కి నెట్టి ఈ కొత్త ప్రపంచపు మాధుర్యాన్ని రుచి చూస్తోంది. ఇంతకు ముందు ఫలానా వాళ్ళ అమ్మాయి. ఫలానా అతని భార్య, ఫలానా వాళ్ళ తల్లి, అత్తగారు, బామ్మ. కానీ ఇప్పుడు తన సొంత పేరుతో ప్రభావతి గారు అనే ఒక ఐడెంటిటీ వచ్చింది. అది ఎంతో బలాన్ని కలిగిస్తోంది.

"నా  క్లాస్స మేట్   శ్రీధర్, అనే అబ్బాయి  వచ్చే ఆదివారం సాయంత్రం ఆర్కిడ్స్ లో అందరం రీ యూనియన్ అవుదామని గ్రూప్ లో మెసేజ్ పెట్టాడు." అంది.

" అబ్బాయి..." ముగ్గురూ తనను చూసి నవ్వడంతో ఆమె మధ్యలో ఆగిపోయింది.

"అబ్బాయి!" ఆమె మనవడు నవ్వుతూ రెట్టించాడు.

"అరవై ఏళ్లు పైబడినా ముసలాళ్ళు తమను తాము అబ్బాయిలు, అమ్మాయిలు అని పిలుచుకుంటారా, నాకు తెలియదే" అంటూ హేళన చేసాడు కొడుకు. ఇంకా నవ్వుతూ, "అమ్మా, దయచేసి నువ్వు వెళుతున్నానని చెప్పకు" అన్నాడు.

"అదేంటి, వెళతాను. మన ఇంటికి దగ్గరగా ఉంది. పైగా ఆదివారం. నేను చాలా సంవత్సరాలుగా సత్యవతిని, శ్యామలను కలవలేదు, అందరినీ కలిసి వస్తాను." నెమ్మదిగా అయినా దృఢంగా అంది.

ఆమె కోడలు భర్త వైపు కోపంగా చూసింది, ఆ చూపుతో కొడుకు "అయ్యో అమ్మా! మేము ఆదివారం సాయంత్రం పార్టీకి వెళ్ళాలి, పిల్లవాడికి ఆ రోజు కూడా ట్యూషన్లు ఉన్నాయి. వాడు తిరిగి వచ్చినప్పుడు ఎవరైనా ఇంట్లో ఉండాలి కదా!" అన్నాడు.

ప్రభావతికి చిరాకుగా ఉంది, అందరికీ వినబడేలా గట్టిగా చెప్పింది, "వాడికి తాళం తీసుకోవడము వచ్చు... నేను నా స్నేహితులను కలవాలనుకుంటున్నాను. మీరు నాతో పాటు వస్తారని ఆశించను కదా! నేనే క్యాబ్ బుక్ చేసుకుని వెళ్ళగలను. ఇది ఎవరికీ కష్టంగా ఉండదనే భావిస్తున్నాను" అని పదునుగా చెప్పింది.

ఆ రాత్రి ఎవరూ ఆమెతో పెద్దగా మాట్లాడలేదు

రీ యూనియన్ రోజున ప్రభావతి ఏ చీర కట్టుకోవాలా అని చూసుకుంటోంది. కొన్ని చాలా గ్రాండ్‌గా కనిపించాయి, మిగిలినవి కొన్ని డైలీ వేర్‌లా ఉన్నాయి.

ఆమె కోడలు చూసింది కానీ ఏమీ సలహా ఇవ్వలేదు. ఆ రోజు నుండి ఆ అమ్మాయి ప్రభావతితో ముభావంగానే ఉంటోంది, పైగా కొడుకుతో " అబ్బో! వెళ్ళేది స్కూల్ రీయూనియన్ కి. ఈవిడేమో పెళ్లి కూతురిలా తయారవడం " అని గొణగడం వింది.

దీర్ఘంగా నిట్టూర్చింది. ఇప్పుడు వాదన పెట్టుకుని మూడ్ పాడు చేసుకోవాలి అనిపించలేదు.

ఆమె క్యాబ్ దిగి లోపలికి వెళుతుంటే తన బెస్ట్ ఫ్రెండ్ ఎప్పటి నుంచో కలవాలి అనుకున్న సత్యవతి వచ్చి భుజాల మీద చేతులు వేసింది. "స్వాగతం ప్రభావతీ, నిన్ను చూసినందుకు ఎంత సంతోషంగా ఉందో చెప్పలేను. చాలా కాలం అయింది మనము కలుసుకుని " అంది. ఒకళ్ళనొకళ్ళు కౌగిలించుకున్నారు.

తన పెళ్లప్పుడు చివరిసారిగా కలుసుకున్నారు, కానీ అది మొన్న మొన్నే జరిగినట్లనిపిస్తోంది.

హాలులోకి ప్రవేశించగానే ప్రభావతికి ఘనస్వాగతం లభించింది. తెలిసిన ముఖాలు, తెలిసిన పేర్లు. అందరూ పెద్దవాళ్ళయిపోయారు, కానీ సంతోషంగా, ఉల్లాసంగా ఉన్నారు. సమయం ఎగిరిపోతున్నట్లు అనిపించింది. కొందరు పాడారు, కొందరు డ్యాన్స్ చేసారు, ప్రభావతి, సత్యవతి స్కూల్లో పాడిన పాత లలితగీతాన్ని ఎవరో గుర్తు చేశారు, ఆ సాయంత్రం వారు ఇద్దరూ మళ్లీ పాడారు. ట్యూన్ ని సాహిత్యాన్ని మరచిపోలేదని గ్రహించి అందరూ ఆశ్చర్యపోయారు,

కొన్ని జ్ఞాపకాలు మన జీవితమంతా చెక్కబడి ఉంటాయి. ప్రభావతిలో ఒక విస్ఫోటనం.

అప్పుడే అందరూ ఇంకో ప్రతిపాదన చేసారు. "రెండు రోజులు పిక్నిక్‌కి వెళ్దాం." ఎవరో ప్రకటించారు.

ఇక దాని గురించి డిస్కషన్స్. అప్పట్లో అబ్బాయిలలో ఎంతో చలాకీగా ఉండే శ్రీధర్, రామకృష్ణలతో పాటు మొహమాటంగా ఉండే రమణ కూడా మాట్లాడాడు.

ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు, ప్రభావతి పిక్నిక్ గురించి తీవ్రంగా ఆలోచించింది. పెళ్ళికి ముందు, తర్వాత కూడా కుటుంబం లేకుండా ఓవర్‌నైట్ పిక్నిక్‌లు లాంటివి వెళ్ళలేదు . ఇప్పుడు కూడా అదే పరిస్థితి. అప్పుడు ఫోన్ గుర్తుకొచ్చింది. అయ్యో ఏదైనా కాల్ వచ్చిందా అనుకుంటూ  ఫోన్ అన్ లాక్ చేసి చూసింది. కొడుకు, మనవడి నుండి ఐదు మిస్డ్ కాల్స్ ఉన్నాయి.

“అయ్యో మనవడు తలుపు తెరవలేకపోయాడా? అతను బయట ఇరుక్కుపోయాడా?” గాభరాపడుతూ కాలింగ్ బెల్ నొక్కింది. తలుపు తీసి మౌనంగా వెళ్ళిపోయాడు మనవడు. కొడుకు కోడలు  సోఫాలో టీవీ చూస్తున్నారు. ఎవ్వరూ మాట్లాడలేదు.

“అమ్మా! నువ్వు ఎక్కడున్నావు? ఎన్నిసార్లు నీకు కాల్ చెయ్యాలి? పిల్లవాడు త్వరగా ఇంటికి తిరిగి వచ్చాడు కాని, వాడు తినడానికి ఏదీ లేదు. అందుకే నీకు ఫోన్ చేసాడు, తీయలేదు, నేను చేశాను జవాబు లేదు, అంత బాధ్యత లేకుండా ఎలా అమ్మా!”

ఆమె అతన్ని మధ్యలోనే ఆపి “నేను పిక్నిక్ డిస్కషన్స్ లో పడి చూసుకోలేదు” అంది.

“ఏంటి పిక్నిక్ కా?" అని మళ్ళీ అరిచాడు. “అమ్మా! నీకు ఏమైంది? మేము ఆఫీస్ లో పని చేస్తున్నామని నీకు తెలుసు. పిల్లవాడిని నీదగ్గర వదిలివేస్తాము. ఇదేమిటి కొత్తగా స్నేహితులతో ప్రయాణం? అయినా వీళ్ళంతా ఎవరు? చూడు అమ్మా, నీ కాల్స్, నీ రీయూనియన్ ఇదంతా నాన్సెన్స్, ఇక ఆపేయి” అన్నాడు.

ప్రభావతి ఇక వినలేదు, గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. ‘ఇది నా ఇల్లు కాదా, నేను ఎవరు? తల్లిని, అత్తని, బామ్మని కదా! స్నేహితులను కలవడానికి వీళ్ళ అనుమతి కావాలా? ఇన్నాళ్ళనుండి వాళ్ళ మాటేగా వింటోంది. ఇప్పుడు స్వతంత్రముగా ఎక్కడికీ వెళ్ళలేనా?’ అని బాధపడ సాగింది.

రాత్రంతా వెల్లువలా వచ్చే మెసేజ్‌లను చూసుకుంటూ గడిపింది. గ్రూప్‌లో ఆ రోజు తీసుకున్న ఫొటోలు, వీడియోలు అన్నీ పెట్టారు. ఆ కొన్ని అద్భుతమైన గంటలలో ఆమె మళ్లీ చిన్నపిల్లలా అయిపోయింది. అప్పుడే పిక్నిక్కు వచ్చే సభ్యుల లెక్క కూడా వేసేశారు.

అంతలోనే మళ్ళీ ఫోన్ బీప్ మంది. అది సత్యవతి దగ్గరనుంచి. ‘ఆమె కూడా నిద్రపోలేదా? ఆమెకి కూడా తన పిల్లల నుండి ఇలాంటి  అనుభవమే ఎదురై ఉంటుందా?’ అని ఆ మెసేజ్ చూసింది.

“ప్రభావతీ! వస్తున్నావు కదా!” అని వ్రాసింది.

క్షణం కూడా ఆలోచించకుండా తన మూడు అక్షరాల జవాబుని టైప్ చేసి సత్యవతితో పాటు గ్రూప్ కి కూడా పంపింది.

అది "Yes "

★★★

COMMENTS